

నేటి నుంచి జులై 12 వరకు
విద్యార్థుల నమోదుపై ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: డోర్ టూ డోర్ సర్వే ఆధారంగా విద్యా హక్కు చట్టం ప్రకారం విద్యార్థుల నమోదుపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యాహక్కు చట్టం ప్రమాణాల ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వం అన్ని అర్హత కలిగిన పిల్లలును గుర్తించేందుకు, వారి స్కూల్ నమోదు కోసం ఒక ప్రత్యేక కార్యక్రమం డోర్ టూ డోర్ సర్వే చేపట్టాలని నిర్ణయించిందన్నారు. 29వ తేదీ ఆదివారం నుంచి జూలై 12వ తేదీ వరకు డ్రైవ్‌ను నిర్వహించాలని, పాఠశాల వయస్సు (6-14) ఉన్న డ్రాప్ అవుట్ లేదా ఇప్పటివరకు స్కూల్‌కి వెళ్లనివారిని గుర్తించాలని తెలిపారు. విద్య ప్రాధాన్యతతోపాటు విద్యార్థులకు అందుబాటులో ఉన్న వసతులు, ప్రయోజనాలు, ప్రభుత్వ పథకాలు గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే తేదీ నుండి ఒక నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి నరసింహారావు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నరసింహారావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జూలై 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెకు జయప్రదం కోసం శనివారం చిత్తూరు సిఐటియు కార్యాలయంలో జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి నరసింహారావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వాలు కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను శరవేగంగా అమలుపరుస్తున్నాయని అన్నారు. 29 కార్మిక చట్టాలు రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చి కార్మికులను కట్టు బానిసలు చేసే ప్రయత్నం చేస్తున్నారని దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు స్థానిక ఫెడరేషన్లు కలిసి సంయుక్తంగా ఇచ్చిన భారత దేశ సార్వత్రిక సమ్మె జయప్రదం కోసం ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు అన్ని కలిసి రావాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు పరచకుండా ప్రజావ్యతిరేక విధానాలు అమలుపరుస్తున్నారని అన్నారు. విశాఖ ఉక్కులో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు 5వేల మందిని తొలగించడం చాలా దుర్మార్గమని అలాగే లక్షలాది మంది కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ స్కీం వర్కర్లను ప్రభుత్వ పథకాలు అమలుపరచకుండా చేయడం చాలా సిగ్గుచేటని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో ప్రభుత్వాలు కూడా 8 గంటల పని విధానాన్ని రద్దుచేసి 10 గంటలు పని చేయించుకోవచ్చు అన్న తీర్మానం ఇప్పటి వరకు ఏ క్యాబినెట్ చేయలేదని అలాంటి దుస్సాహసానికి చంద్రబాబు ప్రభుత్వం పూనుకోవడం చాలా దుర్మార్గమని అన్నారు. 9న జరిగే సార్వత్రిక సమ్మెలో పెద్దఎత్తున కార్మిక వర్గం, విద్యార్థి యువజన మహిళ మేధావి వర్గాలు ప్రజానీకం పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈసమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు గిరిధర్ గుప్తా అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి షకీలా, మమత, ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి గంగా, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గోవిందప్ప, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతిరావు, మధ్యాహ్న భోజనం యూనియన్ జిల్లా కార్యదర్శి వరలక్ష్మి, ఆటో యూనియన్ నాయకులు అయ్యప్ప పాల్గొన్నారు.

వార్డు కార్యదర్శుల బదిలీ కౌన్సిలింగ్ పూర్తి



వార్డు కార్యదర్శుల బదిలీల ప్రక్రియను పరిశీలిస్తున్న నగర కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని వార్డు కార్యదర్శుల బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియను కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ పర్యవేక్షించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో చిత్తూరు, తిరుపతి నగరపాలక సంస్థలు, మదనపల్లి, పుంగనూరు, పలమనేరు, కుప్పం, పుత్తూరు, నగరి, శ్రీకాళహస్తి పురపాలక సంఘాల పరిధిలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న, బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్యదర్శులు, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు, వార్డ్ శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ కార్యదర్శులకు కౌన్సిలింగ్ నిర్వహించి, ఆప్షన్ ఫామ్స్ తీసుకున్నారు. శుక్రవారం కౌన్సిలింగ్‌కు వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్యదర్శులు -184 ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు 192, వార్డ్ శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ కార్యదర్శులు -143, రిక్వెస్ట్ బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న 38 మంది హాజరై ఆప్షన్ ఫామ్స్ సమర్పించారు. రెండు రోజులపాటు జరిగిన కౌన్సిలింగ్ ప్రక్రియలో వార్డు సచివాలయాల పరిధిలో 6 కేటగిరీలకు చెందిన కార్యదర్శులకు కౌన్సిలింగ్ నిర్వహణ సజావుగా పూర్తయింది. ఈకార్యక్రమంలో తిరుపతి అడిషనల్ కమిషనర్ చరణ్ తేజ్‌రెడ్డి, సహాయ కమిషనర్ అవినేని ప్రసాద్, ఉమ్మడి జిల్లాల నగరపాలక కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఒంటికాలిపై ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నిరసన


నగరి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న సిబ్బంది

ప్రజాశక్తి- విజయపురం (నగరి): తమకు ఇచ్చే జీతాలు సరిపోవడం లేదని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా అందడం లేదని, చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ భారంగా మారిందని, తమ విన్నపాన్ని ఆలకించండి సమస్యలు పరిష్కరించండి అంటూ మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది శనివారం మోకాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఆరవ రోజు మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో వారు నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన మేరకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఔట్ సోర్సింగ్ సిబ్బందికి పలువురి సంఘీభావం

పలమనేరు: మున్సిపల్ ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ శానిటేషన్ అవుట్సోర్సింగ్ ఉద్యోగుల నిరవధిక సమ్మెకు వైసిపి కౌన్సిలర్లు, నాయకులు శనివారం సంఘీభావం తెలిపారు. పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు గత 15వ రోజులుగా నిరవధికంగా సమ్మె చేస్తున్నారని, వారి న్యాయమైన కోర్కెలను, సమస్యలను పరిష్కరించాలని నిరసన తెలియజేశారు. మిగిలిన రెగ్యులర్ ఉద్యోగస్తులు లాగా తమను పరిగణించాలని, వారికి వర్తించే అన్ని సదుపాయాలు తమకు వర్తింపచేయాలని, సీనియార్టీ ప్రకారం ప్రమోషన్లు కల్పించాలని, మినిమం టైం స్కేల్ పాటించాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలు తమ కుటుంబాలకు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారి సమ్మెకు సంఘీభావంగా మున్సిపల్ కౌన్సిలర్లు మురళీకృష్ణ, వైస్ ఛైర్మన్ కమల్, వైసిపి నాయకులు రహీం ఖాన్, నాగరాజ్, శ్యామ్ సుందర్ రాజ్, శ్యామ్, రమేష్ రెడ్డి, రాజా పాల్గొన్నారు.


పలమనేరులో వైసిపి నాయకులు సంఘీభావం

పుంగనూరు: మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో ఒప్పంద కార్మికులుగా పనిచేస్తున్న వారి న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అయూబ్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు 15వ రోజు రిలే దీక్షా శిబిరాన్ని పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు వారికి సంఘీభావం తెలుపుతూ శనివారం పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఒప్పంద కార్మికులు న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యదర్శి ముబారక్, శ్రీరాములు, చంద్ర కార్మికులు పాల్గొన్నారు.


పుంగనూరులో క్రాంగెస్ మద్దతు


మామిడి తోటలో మామిడి చెట్ల నరికివేత

పెట్టుబడులు రాక.. గిట్టుబాటు లేక..

మామిడి చెట్లను నరికేస్తున్న రైతన్నలు

ప్రజాశక్తి- సోమల:

మామిడి తోటలలో పంట దిగుబడి కోసం పెట్టిన పెట్టుబడులు రాక గిట్టుబాటు ధర లేక కన్నబిడ్డల్లా పెంచుకున్న మామిడి తోటలలోని చెట్లను రైతులు నరికి వేస్తూ భూములను చదును చేస్తున్నారు.

ఈ ఏడాది మామిడి పంట దిగుబడి ప్రారంభం అయినప్పటి నుండి ఇప్పటివరకు రైతుకు ఆశించిన మేర గిట్టుబాటు ధర రాకపోవడంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితులలో అయిన కాడికి కొందరు మామిడి కాయలు అమ్ముకోగా మరికొందరు పంట కోయకుండానే చెట్లలోనే కాయలను వదిలివేశారు. మరి కొంత మంది మండిల వద్దకు ట్రాక్టర్లలో లారీలలో కాయలు తీసుకువెళ్లి వారు కొనుగోలు చేయకపోవడంతో రోడ్డుపాలు చేసి నిరాశతో ఇండ్లకు వెనుదిరుగుతున్నారు. ఈ పరిస్థితులలో మామిడి పంట ద్వారా ఇకపై నష్టాలే చవిచూడాల్సి వస్తుందని రైతులు ఆలోచించి 20 సంవత్సరాల క్రితం మొక్కలు నాటి వాటిని కన్నబిడ్డల పెంచి పోషించి ఎరువులు మందులు అందజేసి చివరికి కన్నీటిపర్యంతం అవుతూ వాటిని కూలీల ద్వారా నరికి వేయిస్తున్నారు.

మండలంలో సోమల, ఇరికిపెంట, నంజంపేట, ఆవులపల్లి, పెద్ద ఉప్పరపల్లి, అన్నెమ్మగారిపల్లి, పేటూరు, 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీలలో అధికంగా రైతులు మామిడి తోటలను కలిగి ఉన్నారు. ఉపాధి హామీ ద్వారా మొక్కలను నాటి వాటిని పెంచి పోషించి ప్రతి ఏడాది సీజన్లో వచ్చే మామిడి కాయలను అమ్ముకొని అంతో ఇంతో లాభాలు అర్జిస్తూ జీవనం సాగిస్తూ వస్తున్నారు. అయితే ఈ ఏడాది మామిడి రైతుకు ధరలు లేకపోవడంతో తీరని దెబ్బ తగిలి పెట్టిన పెట్టుబడులు రాక చేసిన అప్పులు తీర్చలేక నిరాశ నిస్పృహలతో కృంగిపోయారు. మామిడి రైతులను ఆదుకుంటామని భరోసా ఇచ్చిన ప్రభుత్వం తీరా రైతులకు ఆశించిన మేర ధర ప్రకటించకపోవడం వేయింగ్ మిషన్ల వద్ద కిలోమీటర్ల కొద్దీ మామిడికాయల వాహనాలు నిలిచిపోవడం జ్యూస్ ఫ్యాక్టరీల వారు కాయలను తీసుకోకపోవడం తదితర కారణాలతో రైతు ఇకపై మామిడి పంట ద్వారా ఎలాంటి ఆదాయం ఉండదని అనుకుంటూ తోటలను నరికేస్తూ వస్తున్నారు.

పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ రైతు.. తాను 20 సంవత్సరాల క్రితం 70 మామిడి మొక్కలను నాటగా అవి ఏపుగా పెరిగి ప్రతి ఏడాది ఎంతో కొంత ఆదాయాన్ని తెచ్చేవని ఈ ఏడాది తీవ్ర నష్టాన్ని చవిచూడడంతో చేసేదేమీ లేక చెట్లకు కాయలు ఉండంగానే నరికి వేస్తున్నామని ఆవేదనతో తెలిపారు. ఇదే పరిస్థితి ఇకపై కొనసాగుతూ వస్తే చివరికి మామిడి తోటలు లేక మామిడి కాయలు తినాలంటే కూడా దొరకని పరిస్థితి ఏర్పడే అవకాశం లేకపోలేదు. అన్నం పెట్టే రైతు పండించిన పంటకు పెట్టిన పెట్టుబడులకు లాభాలు రాకపోయినా పెట్టుబడులు వస్తే చాలని ఆశిస్తూ ఈ ఏడాది రాకపోయినా వచ్చే ఏడాదైనా ధర రాకపోతుందా అన్న ఆశావాదిగా ఉంటాడు అలాంటి రైతు కడుపు మండి మామిడి తోటలను నరికి వేస్తున్నారు అంటే రైతుల బాధను అర్థం చేసుకోవచ్చు.

టమోటా సాగు చేసిన రైతులు కూడా ఈ ఏడాది ధరలు లేక పెట్టిన పెట్టుబడులు రాక తీవ్రంగా నష్టపోయారు. సోమల మండలంలోని వందల ఎకరాలలో టమోటా సాగు రైతులు చేయగా లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టి పండించిన పంటకు ఆశించిన మేర ధర రాకపోవడంతో కొందరు పంటను పొలాల్లోనే వదిలివేశారు. అటు మామిడి ఇటు టమోటా రైతులు తీవ్రంగా నష్టాలను చవిచూస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వాలు రైతుల అభివృద్ధికి ఆపన హస్తం అందించే పథకాలను ప్రవేశపెట్టి రైతు కూడా ఎదిగే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రైతులు వాపోతున్నారు.

జిల్లాకు 31 కిసాన్ డ్రోన్లు..



ప్రజాశక్తి- యాదమరి (చిత్తూరు): చిత్తూరు జిల్లాకు 31 కిసాన్ డ్రోన్లను సబ్సిడీ ధర కింద ప్రభుత్వం సరఫరా చేసిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జె.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌కెవివై 2024-25 పథకం కింద కిసాన్ డ్రోన్‌తో గ్రామస్థాయి వ్యవసాయ యంత్రాల బ్యాంకుల స్థాపన కోసం వ్యవసాయ కమిషనర్, గుంటూరు వారు చిత్తూరు జిల్లాకు 31 కిసాన్ డ్రోన్లను కేటాయించారు. ఈ డ్రోన్ల వలన ఎక్కువ ఉపయోగాలు ఉన్నందున అన్ని రంగాల్లోనూ వీటి వినియోగం పెరిగిందని, కావున ప్రభుత్వం ఒక డ్రోన్ విలువ రూ.9.80 లక్షలుగా నిర్ధారించి, ఇందులో 80శాతం రాయితీ అనగా రూ.7.84 లక్షలు పొంది మిగిలిన రూ.1.96 లక్షలు మాత్రమే రైతు వాటా కింద చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రధానంగా 50శాతం వాటా రైతు బ్యాంకులో చెల్లించి మిగతా వాటా అనగా రూ.4.90లక్షలు పొంది మొత్తం సొమ్ము కంపెనీ వారికి చెల్లించి డ్రోన్ కొనుగోలు చేయాలని తరువాత 15 రోజుల్లో ప్రభుత్వం అందించే రాయితీ సొమ్మును రైతు సంఘం ఖాతాకు జమ చేయబడతుందని తెలిపారు. వ్యవసాయ పనులకు కూలీల కొరత వేధిస్తోందని, పురుగు మందులు, నానో ఎరువుల పిచికారీకి డ్రోన్లను వాడుకోవచ్చు అని తద్వారా కూలీల ఖర్చు తగ్గుతుందని తెలిపారు. అంతేకాకుండా సమయం, నీరు, ఎరువులు, క్రిమి సంహారక మందులు ఆదా అవుతాయని, మందులు మొక్కలకు సమానంగా అందుతాయని, వరి, మిరప, వంకాయ, కాలీఫ్లవర్, గోసు, చిక్కుడు, టమాటా, బీర, గుమ్మడి, కాకర వంటి తీగ జాతి పంటలు, మునగ, బొప్పాయి, మామిడి, అరటి, రోజా, బంతి, చామంతి, కనకాంబరం తోటలకు వినియోగించవచ్చునని జిల్లా వ్యవసాయ అధికారి మురళి కృష్ణ తెలిపారు.

పని గంటల్లో.. పాఠాలకే పరిమితం..!

- సమావేశాలంటూ టీచర్లను వేధించొద్దు
- విద్యాశాఖ అధికారులకు ప్రభుత్వ ఆదేశాలు

ప్రజాశక్తి - తిరుపతి

పని గంటల్లో ఉపాధ్యాయులను పాఠాలకే పరిమితం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తరచూ సమావేశాలు అంటూ ఇప్పటివరకు వేధింపులకు గురవుతున్న టీచర్లకు ఊరట లభించింది. ఉపాధ్యాయుల సమయపాలన, పాఠశాల నిర్వహణపై విద్యాశాఖ అధికారులకు నిర్దిష్టమైన మార్గదర్శకాలను డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విజయరామరాజు తాజాగా వెలువరించారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ, ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో సిలబస్ బోధన, పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయుల విధులకు సంబంధించి పక్కాగా వ్యవహరించాలని ఆదేశాలలో జారీ చేశారు. ఈ మేరకు టీచర్లకు ఫండమెంటల్ లెర్నింగ్ పేరిట శిక్షణ ఇవ్వనున్నది. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు ప్రతిరోజూ ఉదయం తొమ్మిది గంటలకు పాఠశాలకు హాజరుకావాలని, సాయంత్రం నాలుగు గంటల వరకూ ఉండాలని ఆదేశించింది. ఉదయం 9.30 గంటలకు ఉపాధ్యాయుడు, విద్యార్థి హాజరు పూర్తిచేయాలి. ఈ ప్రక్రియ పూర్తిచేయకపోతే వెంటనే ఎంఈవో సమాచారం తెప్పించుకోవాలి. పాఠశాలలో సమావేశాలను సాయంత్రం నాలుగు గంటల తరువాత మాత్రమే నిర్వహించాలి. ప్రభుత్వ పాఠశాలల పనితీరు, విద్యార్థుల ప్రవేశంపై విమర్శలు వెల్లువెత్తుతుండడంతో పాఠశాల విద్యా శాఖ ఈ కార్యక్రమాన్ని రూపొందించిందనే వాదన వినిపిస్తోంది. విద్యార్థులకు అన్ని రకాల వస్తువులతో కిట్లు, మధ్యాహ్న భోజన పథకం కోసం కొత్తగా సన్నబియ్యం పంపిణీ చేశారు. సిలబస్‌లో మార్పులు చేశారు. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో టీచర్ల సమయపాలన, వారి పరితీరును మదింపుచేయాలని అధికారులు నిర్ణయించడం గమనార్హం.

పండ్లల్లో రారాజు... ధర బేజారు..

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి ధర చిన్నబోతోంది. జిల్లాలో మామిడి పంట సంక్షోభంలో పడింది. దిగుబడి గణనీయంగా పెరగడంతో రైతుల్లో ఆనందం వికసించినా ధరలు ఉస్సూరు మనిపిస్తున్నాయి. ఫలరేడు (పండ్ల రాజు)గా పేరుగడించిన మామిడికి నేడు ధరల పతనం చేదు అనుభవాన్ని అందిస్తోంది. మద్దతు ధర ఖచ్చితంగా ఇస్తామని చెప్పిన అధికారులు, వాటి అమల్లో మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం. దీంతో రైతులు పంటను రోడ్డు పాలు చేసి, దీనంగా జీవితాలు సాగిస్తున్నారు.

తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలానికి చెందిన దామల్‌చెరువు మామిడి మార్కెట్ ప్రసిద్ధి. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో 1.10 లక్షల ఎకరాల్లో మామిడితోటలు సాగులో ఉన్నాయి. వాటి నుంచి ఏటా ఐదు లక్షల టన్నులు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం అధికారుల అంచనా ప్రకారం 39,985 హెక్టార్లలో తోతాపురి, నీలం, అప్పోన్స్, బేనీషా, మల్లిక రకాలకు చెందిన మామిడి తోటలు సాగులో ఉన్నట్లు వ్యవసాయ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఏడాది రాష్ట్రంలో కృష్ణా జిల్లా తరువాత అధిగ దిగుబడి చిత్తూరు జిల్లాలోనే అని వ్యవసాయ నిపుణుల అంచనా. ఉమ్మడి జిల్లాలో పడమటి మండలాల్లో అధికంగా మామిడి సాగు ఉంది. ప్రధానంగా పల్ప్ పరిశ్రమలకు అవసరమైన తోతాపురిరకం మామిడిని అధికంగా సాగు చేస్తారు. ఉమ్మడి జిల్లాలో 52 మామిడి ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి. కొన్ని యూనిట్లు పూర్తిగా మూతపడ్డాయి. అందుబాటులో ఉన్న 47 మామిడి గుజ్జుపరిశ్రమల్లో 39 పరిశ్రమలు మాత్రమే తెరవబడ్డాయి. అందులో 35 పరిశ్రమలు పూర్తిస్థాయిలో పని చేస్తున్నాయి. గత రెండేళ్లతో పోల్చితే మామిడి దిగుబడే కాదు. నాణ్యత కూడా మెరుగ్గా ఉంది. కానీ రైతులకు మాత్రం ధర లేక ఇబ్బందులు పడుతున్నారు. మామిడి టన్ను ధర భారీగా పతనమైంది. పంటకోసుకెళ్లి మార్కెట్ ఇస్తే కూలీ డబ్బులు కూడా రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు వారాల క్రితం తోతాపురి మామిడి రూ.6 నుంచి రూ.8 వరకు పలికేది. ధరలు తక్కువ కావడంతో అనేక ప్రాంతాల్లో రైతులు పంటను రోడ్డు పక్కన పారబోసి వెళ్లారు. సదుం మండలంలో ఇది ఎక్కువగా జరిగింది. మామిడి రైతులను ఆదుకుంటాం అని ప్రభుత్వం ప్రకటించింది. జిల్లా కలెక్టరు సైతం దామలచెరువు మార్కెట్ మండీని పరిశీలించారు. అనేక సార్లు స్థానిక ఎంఎల్‌ఏ, అధికారులు వెళ్లి పరిశీలించారు. మామిడికి మద్దతు ధర ఇస్తామని ప్రకటించారు. కిలో రూ.12కు కొనుగోలు చేయాలని సూచించారు. అధికారుల బలవంతం వల్ల వ్యాపారులు సరేనని చెప్పినా, చేతల్లో మాత్రం చూపడం లేదు. గురు, శుక్రవారాల్లో దామలచెరువు మండిల్లో ధర కిలో రూ.2.50పైసలు పలకడం గమనార్హం. ఐదు టన్నుల పంట కోసి, మార్కెట్ కు తరలించాలంటే రైతుకు 12 నుంచి 15వేల ఖర్చు అవుతోంది. ప్రస్తుత ధర ప్రకారం ఐదు టన్నులకు 12,500 వస్తుంది. పంట కోసి, మార్కెట్‌కు వెళ్లితే రైతుకు మూడు వేలు చేతునుంచి పడుతోంది. దీంతో రైతులు పంటను చెట్లలోనే వదిలేస్తున్నారు, కొంత మంది తర్వాత ఏడాది పంట దిగుబడి తగ్గుతుందని, పంటకోసం రోడ్డుపక్కన పారబోస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి,పూర్తి స్థాయిలో తాము చెప్పిన కిలో 12 రూపాయలు మద్దతు ధర అమలు అయ్యేలా చేసి, జిల్లాలోని పల్ప్ ఫాక్టరీలు పూర్తిస్థామర్థ్యంతో పని చేసే విధంగా చర్యలు తీసుకుంటే మామిడి రైతులు కొంత ఊరట చెందుతారు. ఆ దిశగా అధికారులు చర్యలు లేవు. జిల్లా కలెక్టరు స్పందించి, వ్యాపారులు, అధికారులను సమన్వయ పరిచి రైతులను అదుకోవాలని మామిడి రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం..!

అపోలో యూనివర్శిటీలో కొత్త కోర్సులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు అపోలో యూనిర్శిటీలో 2025-26 విద్యా సంవత్సరం నుంచి పలు నూతన కోర్సులు ప్రారంభిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.పోతురాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, ఆధునాతన వైద్యశాస్త్ర రంగాలలో వచ్చిన పురోగతుల మేరకు ప్రపంచంలో ముఖ్యమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించాలన్న లక్ష్యంతో ఈ కోర్సులను రూపొందించినట్లు పేర్కొన్నారు. బి.టెక్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (క్లౌడ్ కంప్యూటింగ్), ఎం.టెక్‌లో డేటా సైన్స్, ఎంఎస్‌సిలో మెడికల్ బయో- టెక్నాలజీ, ఇమేజింగ్ టెక్నాలజీ, మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీలో ప్రసూతి శాస్త్రం, గైనకాలజీ, కమ్యూనిటీ రిహాబిలిటేషన్ కోర్సులను ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కోర్సులో చేరాలంటే సంబంధిత సబ్జెక్టులలో ఇంటర్మీడియట్, తత్సమానమై విద్యార్థ అర్హత ఉండాలని, మాస్టర్ ప్రోగ్రామ్‌లకు గుర్తింపు పొందిన సంస్థ నుంచి సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసి ఉండాలని వెల్లడించారు.

సివిల్ సైడ్ అంశాలపై అవగాహన కలిగి ఉండాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా న్యాయవ్యవస్థ అభివృద్ధి పరంగా శనివారం జిల్లా న్యాయసభలో ఒక ప్రాముఖ్యమైన వర్క్‌షాప్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తి, చిత్తూరు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌రెడ్డి ఎక్స్-అఫిషియో చైర్‌పర్సన్‌గా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్ షాప్ కార్యక్రమాలను ప్రారంభించారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న రిసోర్స్ పర్సన్స్ మాజీ జిల్లా జడ్జీలు కృష్ణయ్య, బాలాజీ, రమేష్ బాబు తమ అనుభవాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ సివిల్ సైడ్‌కు సంబంధించిన అంశాలు ప్రతి ఒక న్యాయమూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ముఖ్యంగా సిపిసి సెక్షన్ 9 పరిధి, లోక్ అదాలత్ అవార్డులపై అధికారం, ఇష్యూల రూపకల్పన, తీర్పుల రచన తదితర అంశాలపై న్యాయాధికారులు సుదీర్ఘంగా అధ్యయనం చేయాలని తెలిపారు. న్యాయవ్యవస్థలో సమర్థత పెంపు, నైతిక విలువల పరిరక్షణపై కూడా స్పష్టమైన దృష్టిని ఈ వేదిక కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, జయలక్ష్మి, జి.అర్చన, రమేష్, న్యాయాధికారులు పాల్గొన్నారు.

అపోలోలో వర్క్‌షాప్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి మించిన వృత్తి మరేదీ లేదని, ఈ వృత్తి ఎంతో గొప్పదని అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ వినోద్ భట్ పేర్కొన్నారు. చిత్తూరు అపోలో యూనివర్సిటీలోని డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి నాలెడ్జ్ సెంటర్‌లో శనివారం విద్యారంగంలో వ్యవస్థ- ఆధారిత విధానం, నిరంతర అభ్యాస సూత్రాల పరిచయం అనే అంశంపై ఒకరోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించడం మాత్రమే కాదు.. ఒత్తిడిని ఎదుర్కోవడం నుండి సమర్థవంతంగా కమ్యూనికేట్ చేయడం వరకు అన్ని విషయాలలో విద్యార్థులకు సహాయపడాలని సూచించారు. గొప్ప ఉపాధ్యాయుడు నిరంతరం నేర్చుకుంటూ బోధనా నైపుణ్యాలను మెరుగు పరుచుకుంటూ ఉండాలని, ఇందుకు ఇలాంటి వర్క్‌షాప్‌లు దోహదపడుతాయని చెప్పారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పోతురాజు, అసోసియేట్ డీన్ డాక్టర్ రమ్య రామకృష్ణన్, మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ కిశోర్, అకడమిక్ అఫైర్స్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జీవన్‌కుమార్, హ్యూమన్ రిసోర్సెస్ డీజీఎం డాక్టర్ కొప్పు రమేష్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చెత్త సేకరణను పరిశీలించిన ఎంపిడిఓ



ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని పాతగుంట పంచాయతీలో జరుగుతున్న ఇంటింటికీ చెత్త సేకరణ, అభివృద్ధి పనితీరును శనివారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి పురుషోత్తం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపిడిఓ మాట్లాడుతూ మండలంలోని కొన్ని పంచాయతీలను ఐవిఆర్ఎస్ పంచాయతీలుగా ఎంపిక చేసి, ఆయా పంచాయతీల్లో నిత్యం జరుగుతున్న రోజువారీ ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమంను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్యం, ఇంటింటికీ చెత్తసేకరణ, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ క్లీనింగ్ కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, సచివాలయ సిబ్బంది, హరిత రాయబారులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన 'అక్షర' విద్యార్థులు

ప్రజాశక్తి- విజయపురం (నగరి): మండల స్థాయిలో నిర్వహించిన తల్లికి వందనం పోటీల్లో స్థానిక అక్షర పాఠశాలకు చెందిన విద్యార్థులు రమ్యశ్రీ, గుణశ్రీ, లోహిత్, భరత్ శ్రీదేవ్, చాణక్యలక్ష్మి ప్రతిభ కనబరచి విజేతలుగా నిలవడంతో పాటు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరికి ఎంఇఓ శ్రీదేవి బహుమతులను అందించారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ లతామురళి, ప్రిన్సిపాల్ మునిగన్, ఉపాధ్యాయులు అభినందించారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి- యాదమరి: తవణంపల్లె మండలం, కాణిపాకం గ్రామానికి చెందిన ప్రేమలతకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ అందజేశారు. శనివారం చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే మురళీమోహన్ కార్యాలయంలో కాణిపాకం పల్లం గ్రామానికి చెందిన ప్రేమలతకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ.50,000 చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆర్థిక సహాయం అందజేసి భరోసాగా నిలుస్తుందన్నారు.

విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి- విజయపురం: స్థానిక మండలంలో దాతల సాయం సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులు వెంకటరాజు పేర్కొన్నారు. శనివారం విజయపురం మండలం శ్రీహరిపురం ఆదర్శప్రాథమిక పాఠశాలలోని 50 మంది విద్యార్థులకు దాత దొమ్మరాజు శ్రీనివాసవర్మ తన తల్లిదండ్రులైన దొమ్మరాజు ధనలక్ష్మి జయదేవరాజు జ్ఞాపకార్థం రాతపుస్తకాలు, పలకలు, పెన్సిళ్ళు, పెన్నులు, స్టేషనరీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి జయదేవరాజు, విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీధర్ రాజు, ఉపాధ్యాయులు సూర్యకుమారి, సురేష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అమరావతి సురేష్‌కు సర్వీస్ అవార్డు



ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరుకు చెందిన అమరావతి సురేష్ లయన్స్ క్లబ్‌లో చేసిన సేవలకు గుర్తింపుగా ఔట్ స్టాండింగ్ సర్వీస్ అవార్డ్ ఇచ్చినట్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. లయన్ క్లబ్ ఆఫ్ పుంగనూరు నోబుల్, లయన్స్ క్లబ్ ఆఫ్ పుంగనూరు నోబుల్‌కి చేసిన సేవలను గుర్తించి లయన్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఫ్యాబ్రిషియో ఒలివేరా (యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా) వీరి నుండి ఈ అవార్డును అందుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా లయన్స్ ప్రతినిధులు, లియో క్లబ్ సభ్యులు అమరావతి సురేష్ కుమార్‌ని అభినందించారు.

3న జిల్లాకు కేంద్ర మంత్రి రాక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: భారత ప్రభుత్వ సంస్థ అలింకో సహకారంతో జిల్లా వ్యాప్తంగా జూలై మూడవ తేదీన విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు కృత్రిమ అవయవాల పంపిణీ కేంద్ర మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరుగుతుందని డిఆర్ఓ మోహన్ కుమార్ పేర్కొన్నారు. ముందస్తు ఏర్పాట్లలో భాగంగా శనివారం జిల్లా సచివాలయంలోని డిఆర్ఓ ఛాంబర్‌లో జిల్లా రెవెన్యూ అధికారి వికలాంగులు, వయోవృద్ధులకు ఉపకరణాలు, సహాయ సాధనాల పంపిణీపై ఏఎస్‌పి, ఆర్‌డిఓ, అర్బన్ తహశీల్దార్, డిజెబులిటీ వెల్ఫేర్ ఏడి, డిఎం అర్‌హెచ్ఓ, డిసిహెచ్ఎస్, డీఈవో, డిఆర్డిఏ పీడీ, మునిసిపల్ కమిషనర్ చిత్తూరు, మెప్మా పీడీ, డిపిఓ, జిల్లా రవాణా శాఖ అధికారి, జిల్లా పర్యటక శాఖాధికారి, జడ్పీ సీఈవో, ఫుడ్‌సేఫ్టీ అధికారి, డిడిఐ అండ్ పిఆర్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ , డిపిటిఓ ఏపీఎస్ ఆర్టీసీ అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ. భారత ప్రభుత్వంచే జిల్లాలోని దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ జీవన పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని జూలై మూడవ తేదీన జిల్లా కేంద్రంలో గల పివికేన్ కళాశాలలో పంపిణీ నిర్వహిస్తున్నామని ఈకార్యక్రమానికి కేంద్ర సామాజిక న్యాయం సాధికారత మంత్రి రాందాస్ అథాలే, జిల్లా ఇన్చార్జ్ మంత్రి, జిల్లా ఎంపి, జిల్లా కలెక్టర్, ఎంఎల్ఏలు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా అధికారులు సమిష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా విభిన్న ప్రతిభవంతులకు ఇబ్బందులు తలంచకుండా పివికెఎన్ గ్రౌండ్‌లో స్టాల్స్ నిర్వహించి ప్రతిస్టాలు వద్ద దివ్యాంగులు, వయోవృద్ధులకు వీల్చైర్స్, భోజనం, నీరు సదుపాయాలు ఉంటాయని, మెడికల్ క్యాంపులను నిర్వహించాలని ఆయా శాఖల అధికారులకు తెలిపారు.


సేవాభావానికి ప్రతీక నర్సింగ్ వృత్తి



ప్రజాశక్తి- కుప్పం రూరల్: బిసిఎన్ విద్యాసంస్థలలో భాగమైన కుప్పం నర్సింగ్ కళాశాలలో జ్యోతి ప్రజ్వలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. బిసిఎన్ విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు బిసి నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి డాక్టర్ సుధీర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ద్రావిడ కూడలి కుప్పం నియోజకవర్గ విద్యార్థులకు మెరుగైన సేవలు అందిస్తున్న బిసిఎన్ విద్యాసంస్థల యాజమాన్యాన్ని అభినందించారు. నర్సింగ్ వృత్తి సేవాభావంతో కూడుకున్నదని, ప్రతి విద్యార్థి తమ వృత్తి పట్ల అంకితభావంతో పనిచేయాలని సూచించారు. బిసిఎన్ విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థులకు 8వ సంవత్సరం, జిఎన్ఎమ్ విద్యార్థులకు మొదటి సంవత్సరం జ్యోతి ప్రజ్వలన దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బిసిఎన్ విద్యాసంస్థల ఉపాధ్యక్షులు డాక్టర్ సునీల్ రాజు, కార్యదర్శి సాగర్ రాజు, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై చర్చ

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే మురళీ మోహన్



ప్రజాశక్తి- యాదమరి: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్‌ను శనివారం విజయవాడలో పూతలపట్టు శాసనసభ్యులు కలికిరి మురళీమోహన్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన ప్రధాన పనులు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, రహదారి, తాగునీటి సమస్యలు, విద్యా, వైద్యం రంగాల్లో ఎదురవుతున్న సమస్యలు వంటి అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన నారా లోకేష్ ప్రజల అవసరాలను గమనిస్తూ సమర్థవంతమైన అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడానికి అవసరమైన నిధులు, మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తి సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ఎన్టీఆర్ విగ్రహానికి పాలభిషేకం

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలం ద్రావిడ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేయడంతో ద్రావిడ విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ విగ్రహానికి గజమాలతో సత్కరించి పాలభిషేకం చేసి ఆనందం వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మారుమూల ప్రాంతమైన కుప్పం నియోజకవర్గంలోని ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ విద్యాభ్యాసం మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమని మండల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు టిఎం. బాబు నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్, క్లస్టర్ ఇంచార్జ్ హేమాంబర్ గౌడు, మునిరాజు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ప్రతి ఒక్కరికి ఆరోగ్యం అందించాలని అపోలో హాస్పిటల్ పిఆర్ఓ కదిరుద్దీన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గురుకుల ఉన్నత పాఠశాలలో అపోలో వైద్యసిబ్బంది విద్యార్థులకు వైద్యపరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల ఉన్నత పాఠశాలలో 120 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేపట్టామని ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి తగిన మందుల అందించి వారి ఆరోగ్యం మెరుగుపడాలని మందుల అందించామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు గురు ప్రశాంత్, చైతన్య, వినీత, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమి పూజ

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం పట్టణంలోని కొత్తపేట నేతాజీ రోడ్డు వద్ద శనివారం స్థానిక టిడిపి నాయకులు రోడ్డు పనులను భూమి పూజ చేసి ప్రారంభించారు. కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, పట్టణ టిడిపి అధ్యక్షులు రాజ్ కుమార్ భూమి పూజ చేయగా, పురపాలక సంఘం అధ్యక్షులు సెల్వరాజు అధ్యక్షత వహించారు.

ట్రాఫిక్ నియంత్రణకు 16 కొత్త బైకులు

ప్రారంభించిన జిల్లా ఎస్పీ



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ట్రాఫిక్ నియంత్రణ కొరకు చిత్తూరు జిల్లాకు కేటాయించిన 16 నూతన ద్విచక్ర వాహనాలను శనివారం జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు చిత్తూరు సాయుధ దళం కార్యాలయంలో ఘనంగా ప్రారంభించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పోలీసు విభాగానికి రాష్ట్ర డిజిపి కేటాయించబడిన 16 నూతన వాహనాలను ట్రాఫిక్ నియంత్రణకు ఇవ్వడం జరిగిందని, రోజురోజుకి రోడ్డుపై వాహనాలు పెరగడం దాని వలన ట్రాఫిక్ సమస్యలు కూడా పెరుగుతుండడంతో దానిని నియంత్రించాలానే ముఖ్య ఉద్దేశంతో వాహనాలను ప్రారంభించామని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా ట్రాఫిక్ సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే అక్కడికి వెళ్లి అతిత్వరగా ట్రాఫిక్ సమస్యను తీర్చడానికి లేదా ఎవరిదైన వాహనాలు ఆగిపోయినప్పుడు అటువంటి వారికి సహాయపడటానికి ఉపయోగకరంగా ఉంటుంది. ఈ వాహనాలను ప్రధాన రహదారులు ఉండే పోలీస్ స్టేషన్‌లకు, చిత్తూరు పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు నాలుగు వాహనాలను కేటాయించడం జరిగిందని ఎస్పీ తెలిపారు. అనంతరం అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ అడ్మిన్ ఇంచార్జ్ ఆర్.రాజశేఖర్ రాజు జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించగా జిల్లా ఎస్పీ స్వయంగా ర్యాలీలో పాల్గొన్నారు.

దోమ కాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి ఆధ్వర్యంలో జిల్లాలోని మగ ఆరోగ్య కార్యకర్తలకు ఆరోగ్య సేవలపై ఒకరోజు ఓరియంటేషన్ శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. డిఎం అండ్ హెచ్ఓ మాట్లాడుతూ దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులైన మలేరియా, డెంగీ, ఫైలేరియా, మెదడు వాపు, చికెన్ గున్యా రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ప్రజలతో కలిసి నిర్వహణపై, హాట్‌స్పాట్ ఏరియాలలో స్ప్రేయింగ్, ఫాగింగ్ కార్యక్రమాల నిర్వహణపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు శిక్షణ పొందిన ఆరోగ్య కార్యకర్తలే డ్యూటీ చేస్తున్నారని, అప్పుడప్పుడు కొత్త యాప్లు వస్తునందున రోజువారి చేసే కార్యక్రమాలలో ఆరోగ్య సేవలు అందించిన తర్వాత ఎలా ఆప్స్‌లో నమోదు చేయాలన్నారు. రికార్డ్స్ అప్డేటెడ్‌గా ఎలా నమోదు చేయాలని తెలుసుకోవాలన్నారు. మలేరియా అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ నెలలో 20రోజులు ఫిక్స్ టూర్ ప్రకారం సేవలు అందించాలన్నారు. ప్రతినెలా అనుమానిత జ్వర కేసులను కనీసం 20 రక్త పూతలు కలెక్ట్ చేసి లాబ్‌లో ఇవ్వాలన్నారు. ఎఫ్‌బిడి చార్ట్ వేయటం, ఎంఎఫ్ 2 బుక్స్ మైంటైన్ చేయడంపై వివరించారు. ఈ అనుమానిత కేసులను ఐహెచ్ఐపి పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. అవుట్ బ్రేక్స్ వచ్చినప్పుడు తమ వంతు వీధిని తప్పక నిర్వహిస్తే మరణాలు సంభవించవని తెలిపారు. అలాగే ప్రతి 15 రోజులకు వాటర్ ట్యాంక్ క్లోరినేషన్, వాటర్ లీకేజెస్ ఉన్న చోట రెక్టిఫై చేయించుట తూచా తప్పక చేయాలన్నారు. ఈ శిక్షణలో అన్ని డౌట్లను నివృత్తి చేసుకొని ప్రజలకు ఉచిత సేవలు అన్ని విషయాలపై అవగాహన తెలియపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఏంఓ డాక్టర్ ప్రవీణ, సబ్ యూనిట్ అధికారులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్ఓ సుధారాణి

సీఎం పర్యటన ముందస్తు ఏర్పాట్లపై టెలికాన్ఫరెన్స్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు త్వరలో ఒక రోజు జిల్లా పర్యటన ఖరారు కానున్నది అధికారికంగా ఇంకా ప్రకటన వెలువడ లేదు. సీఎం పర్యటన ముందస్తు ఏర్పాట్లు భాగంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం సాయంత్రం సమయంలో క్యాంపు కార్యాలయం నుండి టెలి కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. కుప్పంలో ముఖ్యమంత్రి నివాసంలో ఒక రాత్రి బస చేసి అనంతరం మరుసటి రోజు ఉదయం సమయంలో అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తారు. పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొంటారు. పబ్లిక్ మీటింగ్‌లో స్టాల్స్ సందర్శిస్తారు, వివిధ శాఖల ద్వారా ప్రభుత్వం నుంచి లబ్ధిదారులకు మెగా చెక్కులు, వివిధ ఆస్తి పనిముట్లు పంపిణీకి సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. డిపిఓ, కుప్పం మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో ఆధ్వర్యంలో శాంతిపురం, కుప్పం మండలాల ప్రధాన కేంద్రంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి, బహిరంగస్థలంలో భారీ కేడ్లు పటిష్టంగా ఏర్పాటు చేయాలని, హెలిప్యాడ్‌లో భద్రత పటిష్టంగా ఉండాలన్నారు. ముఖ్యమంత్రి పాల్గొన్న ప్రదేశాలలో పటిష్టమైన భద్రత చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బహిరంగ సభ వద్ద, తాగునీరు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. టాటా కన్సల్టెన్సీ భాగస్వామ్యంతో కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డిజిటల్ నెర్వ్ సెంటర్ (డీఐఎన్‌సీ)ని ప్రారంభించడంతో పాటు, అధికారులతో సమీక్ష జరుపుతారన్నారు. ఇందుకు తగిన విధంగా సిద్ధమవ్వాలని డిఎంహెచ్, డిసిహెచ్ఓ సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కడా పీడీ వికాస్ మర్మత్ కుప్పం మండల సచివాలయంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులతో సమావేశమయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో వారివారి శాఖల పరిధిలో జరుగున్న అభివృద్ధి పనులపై సమగ్ర డీపీఆర్ తయారు చేసుకోవాలన్నారు. బహిరంగసభ వద్ద జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ, కుప్పం ఆర్‌డిఓ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

థియేటర్లను తనిఖీ చేసిన ఆర్డీవో



ప్రజాశక్తి- విజయపురం (నగరి): నగరి పట్టణంలోని సినిమా థియేటర్లను ఆర్డీఓ భవానిశంకరి శనివారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. థియేటర్ పరిసర ప్రాంతాల్లో భద్రత, పారిశుధ్యంపై ఆరా తీశారు. అనంతరం పార్కింగ్ ఏరియాను పరిశీలించారు. ప్రేక్షకులకు ఫుడ్ కోర్ట్‌లో తినుబండారాల ధరలను తెలియజేసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని యాజమాన్యం వారికి సూచించారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది

ప్రజాశక్తి- బంగారుపాళ్యం : సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి మించిన వృత్తి మరేదీ లేదని, ఈ వృత్తి ఎంతో గొప్పదని ఉప విద్యాశాఖ అధికారి ఇందిరా అన్నారు. శనివారం మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న రామిరెడ్డి భూపాల్‌రెడ్డి పదవీ విరమణ కార్యక్రమం ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ఎప్పటికీ గురువులకు ప్రత్యేక గుర్తింపు ఉందని విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్పుతూ వారి సక్రమంగా మలిచేందుకు ఉపాధ్యాయులు ఎంతో శ్రమిస్తారని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిలో రామిరెడ్డి భూపాల్‌రెడ్డి చేపట్టిన సేవలను పలువురు కొనియాడారు. అనంతరం



ఆయనకు దృశ్యాలవులతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు రమేష్, రాజేంద్ర, వాసుదేవన్, నటరాజన్ ప్రధానోపాధ్యాయులు చంద్రకళ, భేరీనాథ్ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

ప్రత్యేక ప్రతిభావంతులకు బ్యాటరీ సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు పంచాయతీలో రామానాయుడుపల్లి సమీపంలోని గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్‌మోహన్, మురళీ మోహన్ ఎమ్మెల్యే థామస్‌కు జన్మదిన శుభాకాంక్షలుత ఎలిపారు. అనంతరం 10వేల మందికి అన్నదాన కార్యక్రమం చేయడంతోపాటు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే వరత్తూరు పంచాయతీ కనికాపురం గ్రామానికి చెందిన పొదిలి వినోద్ నాయుడు ప్రత్యేక ప్రతిభావంతులు ఆరు మందికి ఒక్కొక్కరికి రూ.50 వేలు విలువచేసే మూడు చక్రాల బ్యాటరీ సైకిళ్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి అధ్యక్షుడు సిఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మేయర్, డిప్యూటీ మేయర్ అముద, రాజేష్, చుడా చైర్మన్ హేమలత, జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రతిభావంతులకు బ్యాటరీ సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ద్విచక్ర వాహనం వితరణ

వెదురుకుప్పం: రాష్ట్ర ప్రభుత్వ విప్, గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర వివిఎం.థామస్ జన్మదిన వేడుకల్లో భాగంగా శనివారం మండలంలోని పెరుమాళ్ళపల్లి హరిజనవాడకు చెందిన భాస్కర్ కుమారుడుకు లవకుమార్‌కి ద్విచక్ర వాహనం వితరణ చేశారు. టిడిపి నేత మోహన్ మురళి ఉన్నారు.

ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని

సందర్శించిన కర్ణాటక మంత్రి



ప్రజాశక్తి-గుడిపల్లి : ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని కర్ణాటక రాష్ట్ర న్యాయశాఖా మంత్రి హెచ్‌కె.పాటిల్, శనివారం సందర్శించారు. ఈసందర్భంగా వారు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య యం.దొరస్వామి, కులసచివులు ఆచార్య కిరణ్ కుమార్ ఆచార్యఎంఎన్.వెంకటేష్, ఆచార్య కె.శారద, ఆచార్య జయలలిత, ఆచార్య బి. శివకుమార్, ఆచార్య శ్రవణ కుమార్, డాక్టర్. దుర్గాప్రవీణ్, డాక్టర్ మల్లేషప్ప, ఆచార్య శ్రీనివాస్ కుమార్ విశ్వవిద్యాలయ పురోగతి భాషాభివృద్ధి, కన్నడ భాష సేవలు, తదితర విద్యావిషయక వికాసాన్ని గురించి మంత్రితో ఇష్టాగోష్టి చర్చ జరిపారు. ద్రావిడ భాషల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కన్నడభాష నుండి ఇతర ద్రావిడ భాషలకు ప్రాచీన సాహిత్యాన్ని, సామాజిక, రాజకీయశాస్త్ర, న్యాయశాస్త్రాలకు సంబంధించి పదకోశాలను తయారు చేయడం, వాటి వలన కలిగే ప్రయోజనాలను మంత్రికి వివరించారు. కర్ణాటక మంత్రి మాట్లాడుతూ ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని సందర్శించటం తనకు ఎంతో సంతోషంగా ఉందని, విశ్వవిద్యాలయం వారి ప్రతిపాదనలను తాము ప్రభుత్వం తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటుందని మంత్రి తెలియజేశారు.

మాజీ సైనికుడికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- కుప్పం రూరల్: వికలాంగ మాజీ సైనికులకు కేంద్ర ప్రభుత్వం సువర్ణ అవకాశాన్ని అందిస్తోందని మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ శాఖ చిత్తూరు జిల్లా అధికారి బివి.రాఘవులు తెలిపారు. కుప్పం మండలం కురుమానిపల్లి గ్రామానికి చెందిన మాజీ సైనిక ఉద్యోగి నరసింహులుకు ప్రభుత్వం తరపున ప్రత్యేక ఆర్థిక సాయాన్ని మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ శాఖ అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు అంగవైకల్యం కలిగిన మాజీ సైనిక ఉద్యోగులకు ప్రత్యేక ఆర్థికసాయాన్ని అందించడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. ఇందులో భాగంగా నరసింహులుకు ప్రభుత్వం తరపున రూ.5వేలు చెక్కును అందించడం జరిగిందని, ప్రతినెలా వారికి అందుతున్న పెన్షన్ సొమ్ముతో పాటు మరో రూ.5వేలు వారి ఖాతాలో జమ అవుతుందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అర్హత కలిగిన మాజీ సైనిక ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా వెల్ఫేర్ ఆర్గనైజర్ వినాయక రెడ్డి, మాజీ సైనిక ఉద్యోగుల సంఘం కుప్పం నియోజకవర్గ అధ్యక్షులు రవిచంద్ర, ప్రధాన కార్యదర్శి దేవరాజు, ఉపాధ్యక్షులు రామమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి బాలకృష్ణ, సభ్యులు శరవణ కుమార్ పాల్గొన్నారు.

ఫుట్ బాల్ టోర్నమెంట్‌లో

ఛాంపియన్‌గా నిలిచిన తిరుపతి జట్టు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఫుట్‌బాల్ క్లబ్ నిర్వహించిన జూనియర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లను పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విజయవంతంగా నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో తిరుపతి, చిత్తూరు జట్లు ఫైనల్స్‌లో తలపడగా తిరుపతి జట్టు విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. చిత్తూరు జట్టు రన్నర్స్‌గా నిలిచారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శ్రీపురం సీతారామయ్య, సాయి శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్ డైరెక్టర్ కె.కిషోర్ కుమార్ హాజరయ్యారు. పలమనేరు ఫుట్‌బాల్ ప్రెసిడెంట్ నవీన్ కుమార్, ఎస్‌విసిఆర్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ షణ్ముగం, అధ్యాపకులు సుబ్బయ్య నాయుడు, నందీశ్వరయ్య, చిత్తూరు జిల్లా ప్రెసిడెంట్ కిషోర్ కుమార్, తిరుపతి- నెల్లూరు కోచ్‌లు పాల్గొన్నారు. పలమనేరు ఫుట్‌బాల్ కోచ్‌లు విక్రమ్ రాజ్ కిరణ్, జాకీర్, సాగర్ గెలుపొందిన జట్లను అభినందించారు.

క్రీడల్లో ఓటమి గెలుపులు సహజం

ప్రజాశక్తి- కార్వేటినగరం: క్రీడల్లో ఓటమి గెలుపులు సహజమని, ప్రతి ఒక్కరూ విన్నర్లేనని జీడీ నెల్లూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త కళత్తూరు కృపాలక్ష్మి అన్నారు. శనివారం మైనారిటీ యూత్ కీరాఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్ ముస్లిం మైనారిటీ ప్రీమ్ లీగ్ క్రికెట్ టోర్నిమెంట్లో రన్నర్లు, విన్నర్లకు కృపాలక్ష్మి చేతుల మీదుగా నగదు బహుమతులు ట్రోఫీలను అందించారు. అనంతరం విజేతలకు ట్రోఫీతో పాటు, రూ.9999, రన్నర్స్‌కు రూ.7777లు బెస్ట్ బ్యాట్మెను రూ.3933, టెస్ట్ బౌలర్‌కు రూ.2222ల నగదును అందించారు. సర్పంచ్ ధనంజయవర్మ, మండల పార్టీ కన్వీనర్ శేఖర్రాజు, వైసిపి నాయకులు చందురాజు, కార్తిక్, యశోదారెడ్డి, శ్రీనివాసులురెడ్డి. పవన కుమార్, శివప్రకాష్ పాల్గొన్నారు.

నాగిరెడ్డి మృతికి నివాళి అర్పించిన పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - రొంపిచర్ల: మండలంలోని జాండ్లవారిపల్లి సర్పంచ్ దేవులపల్లి నాగిరెడ్డి మృతదేహానికి మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. శనివారం సాయంత్రం ఆయన అంత్యక్రియలో పాల్గొని వారి కుటుంబీకులను ఓదార్చి పరామర్శించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని, పార్టీకి నాగిరెడ్డి లేని లోటు తీర్చలేనిదని అన్నారు.

రొంపిచర్ల మండలం జాండ్లవారిపల్లి పంచాయతీ గ్రామసర్పంచ్ దేవులపల్లి నాగిరెడ్డి (70) శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడికి గత కొన్ని రోజులుగా ఆరోగ్యం సరిగ్గా లేక ఛాతిలో నొప్పితో బాధపడుతూ ఉండేవారు. జబ్బు ఎంతకీ నయం కాకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుని కుమారుడు కిరణ్ కుమార్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చౌక దుకాణం ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి- రొంపిచర్ల: మండలంలోని బండకింద పల్లి గ్రామంలో చౌక దుకాణం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు తహశీల్దార్‌కు శనివారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ కాలనీ, మట్లోళ్లపల్లె, కమ్మోళ్లపల్లి గ్రామస్తులు చౌక దుకాణానికి వెళ్లాలంటే హైవే రోడ్డు దాటుకుని బండకింద పల్లిలోని రేషన్ షాప్‌కు వెళ్లాల్సి వస్తుందని, హైవే రోడ్డు దాటుకుని వెళ్లాలంటే 2 కిలోమీటర్ల దూరం వెళ్లాని, దాదాఉ 170 కుటుంబాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ మూడు పల్లెలలోనే గ్రామస్తుల కోరిక మేరకు ప్రభుత్వ చౌక దుకాణాన్ని ఏర్పాటు చేయాలని మండలం తహసీల్దార్‌కు విన్నవించుకున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు సౌకర్యం కలిగేలా చూడాలని కోరుకుంటున్నారు. వెంకట రమణారెడ్డి, భాస్కరయ్య, గంగిరెడ్డి, సరస్వతి, అనిత, గోపాల్ రెడ్డి, ఆనంద పాల్గొన్నారు.

నూతన తాగునీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి- విజయపురం (నగిరి): నగరి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుండ్రకుప్పం పాఠశాలకు నీటి సౌకర్యం కొరకు నూతన బోరును వేయడం జరిగింది. అలాగే ఆటస్థలంలో పెరిగివున్న ముళ్ళకంపలను సర్పంచ్ బాలప్రసాద్ రెడ్డి సహాయంలో రెండురోజులు శుభ్రం చేసి మట్టి పరచి చక్కని ఆటస్థలాన్ని ఏర్పాటు చేయించారని పాఠశాల ప్రధాన్లోపాధ్యాయురాలు నీరజారాణి తెలిపారు.